# అద్దెకో హృదయం

## సుజాత

బయట కుండపోతగా వర్షం కుర్తుస్తున్న చప్పుడు. గాలికి ఉండుండీ కిటికీ రెక్కలు కొట్టుకొంటున్నాయి. దాదాపు గంటన్నర నుండీ వీడియో చూస్తున్న నాకు టైమ్ ఎంతయిందో తెలీలేదు.

ఆ హీరోయిన్ అందాన్ని చూస్తుంటే, వెచ్చగా గొంతులో ఫారిన్ విస్కీ దిగుతూ ఉంటే.....నిజంగా ఆ ఏంజిల్ నా రూంలోనే ఉన్నట్లు, స్వర్గం ఇదే అయినట్టూ అనుభూతి. 'ఇమాన్యువల్ ముగ్ధత్వం, అమాయకమైన పసిపాప లాటి చూపులు, ఆహా.. 'డేట్ విల్ ఎన్ ఏంజిల్'... గ్లాసులోని ఆఖరి సిప్ ఖాళీ చేస్తూ వాచ్ చూసుకున్నాను. రాత్రి పదకొండున్నర. డిసెంబర్ నెల, నరాలు జివ్వుమనిపించే చలి. లేచి వెళ్ళి కిటికీ తలుపులు మూశాను. బయట గాఢాంధకారంగా ఉంది. స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. రివ్వున వీచే గాలి హోరు

**రక్షణకోసం తలుపుతట్టిన అసహాయ అబలను ఆ దృష్టితో చూడటం తప్పని మనసు వారిస్తున్నా శరీరం మాట వినటంలేదు. నసాళానికి అంటిన విస్కీమత్తు, తమకం రేపిన వీడియో సుందరి అందం, ఆమెను తలదన్నే ...**

వింటుంటే తుపాను వస్తుందేమో అన్నట్లుగా ఉంది.

ఇంత కమ్మని వాతావరణంలో రగ్గు కప్పుకొని ఒంటరిగా పడుకోవాలి. శ్రీమతి పుట్టింటికెళ్ళి దాదాపు నెలైందేమో! రక్తం రుచి మరిగిన పులిలా నరాలు తియ్యని బాధతో స్త్రీ స్పర్శకోసం తహతహలాడుతున్నాయ్! ఈ రోజు ఓ పెగ్గు ఎక్కువయిందేమో చెప్పలేని సంచలనం నరనరాన రక్తం వేడెక్కుతోంది క్రమంగా. ఇంకో రెండు పెగ్గులు లాగిస్తే—బహుశా ఈ నరాల బాధ ఉపశమనమిస్తుందేమో అని బాటిల్ వైపు రెండడుగులేశాను. కాలింగ్ బెల్ మోగిన చప్పుడు ఇంత రాత్రిలో, ఈ జోరువానలో ఎవరై ఉంటారు? ఉండుండీ గాలి హోరు ఉధృతమవుతున్న కారణాన, మందెక్కువైనందున కలిగిన భ్రమేమో! అనుకొని బాటిల్ చేత్తో పట్టుకొన్నాను. ఈసారి తలుపులు దబదబా బాదిన చప్పుడుతో, వెంటనే మళ్ళీ కాలింగ్ బెల్ మోత. చేతిలోని బాటిల్ టీపాయ్ మీద విడిచి, తలుపులు తీశాను. వరండాలోని మసక వెలుతుర్లో పూర్తిగా తడిసి, చలికి ఒణుకుతున్న ఓ యువతి . తప్పుకొని దారి ఇచ్చాను. వెంటనే లోనికి నడిచింది ఆమె. "ఎక్స్యూజ్ మీ! మా ఫ్రెండ్‌కు ఆటోదొరక్కుంటే ఇంట్లో విడిచేందకని కారులో బయులుదేరాను. అక్కడ కాస్త లేటైంది. సన్నగా వర్షం ప్రారంభమైంది. వర్షం పెరిగేలోగా ఇల్లు చేరాలని బయలు దేరాను. వర్షం జోరెక్కువయింది. కారు కాస్తా (ట్రబులిచ్చి) ఆగిపోయింది. ఒంటరిగా కారులో ఉండేందుకు భయమేసి ఎదురుగా కనపడ్డ మీ ఇంటి బెల్ నొక్కాను." చలికి వణుకుతూ, పమిట భుజాలచుట్టూ లాక్కుంటూ త్వరత్వరగా అన్నదామె!

ఒంటికి అతుక్కుపోయిన చీరలోంచి ఆమె వంపుసొంపులు ఎంత దాచాలన్నా దాగనంటున్నాయి! పల్చని షిఫాన్ చీర, అదేరంగు స్లీవ్‌లెస్ బ్లౌజ్, భుజాల వరకూ కత్తిరించిన జుట్టు, హైహీల్స్, అల్ట్రా మోడర్న్ సొసైటీ యువతిలా ఉంది. నుదుటి మీదనుండి ధారగా కారుతున్న వర్షపునీరు...కొండపై నుండి దూకే జలపాతంలా, ఆమె ఉన్నతమైన వక్షం మీదుగా జారి, నాభి ప్రాంతంలో అదృశ్యమవుతున్నాయి. రెప్పలార్పకుండా ఆమె అందాల్ని వీక్షిస్తున్న నన్ను నా అంతరంగం హెచ్చరికతో తేరుకొని, "రండి, ఒక్కనిముషం"... అంటూ లోనికెళ్ళి టవలుతో పాటు, మా ఆవిడ చీర, లంగా, జాకెట్, టవలూ ఇచ్చి రూం చూపించాను. అవి తీసుకొని లోనికి వెళుతున్న ఆమె నడుం చూసి నాగుండెలయ తప్పింది క్షణం పాటు. థర్టీ సిక్స్ ట్వంటీ ఫోర్, థర్టీ సిక్స్ అని వినడమే కాని చూసిందా క్షణమే అనిపించింది నాకు. బహుశా ఎక్సర్‌సైజ్ చేసే బాడీ ఏమో చాలా పొందిగ్గా—అంగాంగం పుష్టిగా సౌష్ఠవంతో మెరసిపోతున్నది.

చీర మార్చుకొని వచ్చిందామె! ఇంకా చలి తగ్గనట్లుగా తల టవలుతో తుడుచుకొంటూ వొణుకుతున్నట్లుగా అనిపించి. వేడి వేడిగా టీ చేసి అందించాను 'థాంక్యూ' అంటూ అందుకుందామె. అంతలో కరెంటు పోయింది ఇంట్లో. లేచి అగ్గిపుల్ల వెలుగులో ఎమర్జెన్సీ లాంప్ వెలిగించాను. ఆ వెలుతుర్లో అప్సరసలా కనిపిస్తోందామె నాకంటికి. బిగుతుగా ఒంటికి అతుక్కొన్ననా శ్రీమతి రవికె ఆమె యవ్వనసిరుల్ని దాచలేక ఏ క్షణమైనా ఫట్‌మనేందుకు సిద్ధంగా ఉంది.

పమిట తొలగిన అందాలన్ని తిలకిస్తున్న కళ్ళద్వారా సంకేతాలందుకొన్న నా నరాలు హై వోల్టేజ్ ప్రవహిస్తున్న విద్యుత్ తంత్రుల్లా కంపిస్తున్నాయ్! 'టీ'ని సిప్ చేస్తున్న ఆమె అధరాలు మధుపాత్రవు నీవే రారమ్మనట్లు కవ్విస్తున్నాయి!

పరాయి ఆడదాన్ని అందునా అర్ధరాత్రి నమ్మకంతో, రక్షణకోసం తలుపుతట్టిన అసహాయ అబలను ఆ దృష్టితో చూడటం తప్పని మనసు వారిస్తున్నా శరీరం మాట వినటంలేదు. నసాళానికి అంటిన విస్కీమత్తు, తమకం రేపిన వీడియో సుందరి అందం, ఆమెను తలదన్నే సుందరాంగి ఎదురుగా....నాస్థితిలో ప్రవరాఖ్యుడున్నా ఆగలేడేమో—ఏమయితే అదవుతుందన్న తెగింపుతో ఆమె దరిచేరాను. కైపెక్కిన నాకళ్ళలోకి చూసిన ఆమె ఏమాత్రం బెదరలేదు సరికదా, తనూ సిద్ధమే అన్నట్లుగా లేచి నిలబడింది.

ఆమె కళ్ళలోనూ కదలాడిన కాంక్షజీర గ్రీన్ సిగ్నల్‌లా అనిపించింది. అంతే! గాఢంగా వాటేసుకొన్నాయ్ నాలుగు చేతులు. పెదవులు నాలుగూ అమృతధారల్ని జుర్రుకొంటున్నాయి! ఆమెఎద మెత్తగా తగులుతూ పిచ్చెక్కిస్తోంది. అంతే! బెడ్ మీద ఏకమయిన రెండు శరీరాలు అరగంట తర్వాత విడివడ్డాయి! పులకరించిన భూదేవి తృప్తిగా నవ్వి వరుణిడికి వీడ్కోలిచ్చినట్లుగా వర్షం కూడా వెలిసింది. కరెంటు వచ్చింది. ఒంటిమీద నూలుపోగులేని ఆమె సిగ్గుగా బ్లాంకెట్ మీదకు లాక్కుంది.

మత్తు దిగి, తిమ్మిరి అణిగిన నాకు ఆమె వంక చూడాలంటే భయంగా, సంకోచంగా అనిపించి—అటు తిరిగి చిన్నగా అన్నాను. "ఐయాం సారీ! నేను...నేను... నన్ను క్షమించండి. వివాహితుడ్ని విస్కీతాగిన మత్తులో".... ఇంకా ఏదో అనబోతున్న నన్ను మాటలతో అడ్డుకొందామె! "ఇట్సాల్‌రైట్. తప్పు మీ ఒక్కరిది మాత్రమే కాదు. నా సహకారం లేకుండా బలత్కారం చేయగల ధైర్యమున్నంత చెడ్డవారూ కారు మీరు. నేనూ మీస్థితిలో ఉన్న కారణంగానే నా సహకారం మీకు లభించింది. నేనూ వివాహితురాల్నే! మూడు నెలలుగా వారు ఓవర్‌సీస్ టూర్‌లో ఉన్నారు. వారికి డబ్బు, అంతస్థు తప్ప భార్యంటే ఏమిటో తెలీదు. కనీసం ఆమెకు ప్రాణం ఉందనే మాట కూడా గుర్తించరు.

భార్యంటే షోకేసులో బొమ్మవారికి—దుమ్ముపిండితే ఇతరులు చూస్తారని దుమ్ము దులపడం మినహా ఇంకే విలువ లేదు ఆ బొమ్మకు. అద్దెకు శరీరాలు కొనడం వారి హాబీ! నేను అద్దెకు హృదయం దొరుకుతుందేమోనని వెతుకుతున్నాను. మీకభ్యంతరం లేకుంటే...మీ హృదయం నాకద్దెకిస్తారా!" అద్దె ఎంతైనా పరవాలేదు. ఈ ఫ్రస్టేషన్ నేను భరించలేకున్నాను.

ఈ మెంటల్ డిప్రెషన్‌తో నేనేమైపోతానో నాకే అర్థం కావడంలేదు. కొద్ది రోజుల్లో పిచ్చెక్కినా



ఆశ్చర్యపోనక్కర్లేదు. నాకు తలవాల్చుకునేందుకు ఓ భుజం అవసరం కావాలి". క్రమంగా ఎమోషనల్‌గా అయిపోతూ అంటున్న ఆమె క్షణం ఆగింది.

"మాకు పిల్లలు లేరు. నాలో ఏ లోపమూలేదని డాక్టరు చెప్పారు. అయినా తప్పంతా నాదే అన్నట్లు నిందిస్తారు. నోరారా ఆప్యాయంగా పలకరించే మనిషి కూడా లేరు. హోండాలు, క్రెడిట్ కార్డులు, బ్యాంకు బాలెన్సులు తప్ప." కళ్ళలోనుండులు తిరుగుతున్న నీళ్ళు నెప్పకనే చెబుతున్నాయి. ఆమె అబద్ధం ఆడడం లేదని.

ఆవిడ ఆ స్థితికి కారణం మానసిక అపరిణితి కూడా ఓ భాగమే! లేకుంటే అంత అమాయకంగా అర్దెకు హృదయాన్ని అడుగుతుందా? జాలేసింది నాకు.

చిన్నగా నిట్టూరుస్తూ అన్నాను."చూడండి ప్రతివాడూ నీతులు బోధించేవాడే! అనుకోకపోతే. ఓమాట చెప్పనా"? చెప్పండన్నట్లుగా తల ఆడించిందామె కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"మీవారుచేసే పనినే మరో రకంగా చేసిన నేను మీ కంటికి ఉత్తముడిగా అనిపిస్తున్నానా? నాకూ, మీవారికి తేడా ఏమిటి చెప్పండి? పోనీ మీ అసహనానికి, అసంతృప్తికి, సమస్యకు శాశ్వత పరిష్కారం ఇదే అనైనా అనిపిస్తోందా? మీరు తెలివిగల వారు. ఆలోచించండి. చలం గారి 'స్త్రీ' చదివారా"?

"లేదు"

"జిడ్డు కృష్ణమూర్తిగారి బుక్స్ చదివారా"?

"ఊఁ హూ"

"పోనీ నేనిస్తాను. చదివి చూడండి. ఇన్ మై ఒపీనియన్ దేరీజ్ నో వర్డ్ ఎగ్జిస్టింగ్ కాల్డ్ డిప్రెషన్! ఇట్ ఈజ్ టోటల్లీ ఇమ్మెట్యూరిటీ ఆఫ్ ద మైండ్. జీవితాన్ని ఒకే కోణంలో నుండి, ఒకే పరిధిలో చూడకండి.

కాసేపు మీరు, మీ భావాలు, కోరికలు,అసంతృప్తిలు వగైరా వృత్తం నుండి బయటపడి ఒక ప్రేక్షకురాలిగా మీ చుట్టూ ఏం జరుగుతుందో పరీక్షగా చూడండి.

అలాగే మీ వైపూ పరిశీలనగా ఒక్కసారి చూసుకోండి మన భావాల్ని మనమే శాసించుకోలేని స్థితిలో మరొకరికి భావాల్ని శాసించగలమంటారా? దేవుడు మీకు ఎన్నో ఇచ్చాడు. వాటిని సదుపయోగం చేయడం నేర్చుకోండి. తద్వారా ఆనందం పొందగలుగుతారు. ఆనందం వేరు, సుఖం వేరు.

మరొకరు తుడిచివెయ్యలేని మానసిక భావం ఆనందమైతే, ఇతరాలపై ఆధారపడింది సుఖం. సుఖం దుఃఖానికి నాంది వాచకం. ఇది వేదాంతం కాదు. ఇదే జీవిత సత్యమూకాదు.

ఇతరుల బలహీనతలు చూసి అసహ్యించుకొంటూ, వారి స్థితికి దిగజారేకన్నా, అలాటివారిని చూసి జాలిపడుతూ వారికన్నా ఓ మెట్టు పైకెదిగి, క్షమించడంలో ఉన్నతత్వం లేదంటారా?

ఆమె అలాగే ఆలోచిస్తూ వేకువ వరకూ మేల్కొని ఉండిపోయింది. ఆమె అంతరంగ మథనాన్ని గమనించిన నేనూ మౌనంగా పుస్తకపఠనంలో లీనమయ్యాను.

ఉదయాన శలవు తీసుకుంటున్న ఆమెకు కృష్ణమూర్తిగారి "ఫ్రీడమ్ ఫ్రం ది నోన్" అనే బుక్ ఇస్తూ 'బెస్టాఫ్ లక్' అంటూ తిరిగి హాల్లోకి రాగానే టీపాయ్ మీది ది సెకండ్ పెంగ్విన్ కృష్ణమూర్తి రీడర్ బుక్ అట్టమీది నుండి కృష్ణమూర్తిగారు నావైపే సూటిగా చూస్తూ ప్రశ్నించినట్టయింది.

"అదిసరే! ఇంతకు నీవైపు నువ్వు ఎప్పుడైనా పరిశీలనగా చూసుకున్నావా" అని—గతుక్కుమన్నాను!?

*